నిరుద్యోగ భృతి ఎప్పుడు?



మాది పేద కుటుంబం. మా తల్లిదండ్రుల కష్టంతో బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేశాను. గత ప్రభుత్వం ఎన్నికల ముందు నవరత్నాలు హామీ ఇచ్చి అమలుపరచింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సూపర్ సిక్స్ పథకాల గురించి ఊదరగొట్టి అధికారంలోకి వచ్చింది. 100 రోజులు దాటింది. నిరుద్యోగ భృతి కింద ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తామన్నారు. ఇంకెప్పుడిస్తారు?

– కాళ్ల రవికుమార్ డిగ్రీ, జె.నాయుడుపాలెం గ్రామం, రోలుగుంట మండలం

స్కూలు ఫీజులకు ఒత్తిడి



ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో గెలిపించాం. ఈ ఏడాది తల్లికి వందనం డబ్బులు ఇవ్వలేమని చెప్పడం మోసం చేయడమే. ప్రైవేటు స్కూలులో మా పిల్లలు చదువుతున్నారు. ఇద్దరికి ఏడాదికి రూ, 30 వేలు వస్తాయని ఆశ పడ్డాను.

– సుంకరి చంద్రమ్మ, బుచ్చెయ్యపేట గ్రామం, మండలం

మహిళలకు ఆర్థిక సాయం ఏదీ?



ఎన్నికల ముందు ఊక దంపుడు ప్రసంగాలతో ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని ఊరూరా కూటమి నాయకులు ప్రచారం చేశారు. కరపత్రాలు పంచిపెట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని పూర్తిగా మరిచి పోయారు. ఈ పథకం పేదవారికి ఎంతో ఉపయోగం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు న్యాయం చేయాలి.

– కె.లక్ష్మి, కె.జె.పురం జంక్షన్, మాడుగుల మండలం

ఈ సమయానికి అమ్మఒడి పడేది



మేము ప్రైవేట్ సెక్టార్‌లో పని చేసుకుంటూ జీవనం చేస్తున్నాం. ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడిలో చదివిస్తున్నాం. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పారు. ఇంత వరకు ఇవ్వలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సమయానికి అమ్మ ఒడి డబ్బులు అకౌంట్‌లో పడేవి.

– లోకవరపు శారద, నర్సీపట్నం

పెట్టుబడి సాయం ఏదీ?



మాకు రెండెకరాల పొలం ఉంది. వరి పంట సాగు చేస్తున్నాను. ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద డబ్బులు వేయక సాగుకు ఇబ్బంది పడుతున్నాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతు భరోసా పడింది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావసున్నా అన్నదాత సుఖీభవ డబ్బులు ఇవ్వకుంటే ఎలా?

– ఆర్.గోవింద(రైతు), యరకన్నపాలెం, నర్సీపట్నం

రూ.1,500 సాయం ఉత్తమాటేనా?




మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ఎన్నికల వేళ కూటమి నేతలు ప్రచారం హోరెత్తించారు. ఊరూరా సభ, సమావేశాల్లోనూ పదే పదే ఇదే హామీని ఊదరగొట్టి మహిళలను ఆకట్టుకున్నారు. తీరా ఎన్నికల్లో గెలిచాక హామీ ఊసెత్తక పోవడం దారుణం. మహిళలంతా ప్రతి నెలా రూ.1,500 ఎప్పుడిస్తారని ఆశతో ఎదురు చూస్తున్నారు. తక్షణమే అందించి ఆదుకోవాలి. లేకుంటే మహిళల ఉసురు తగులుతుంది.

– గంగవంశం, రజనీ, దేవరాపల్లి గ్రామం

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

– సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



"అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ... వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థికసహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం... నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తాం.. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 చొప్పున అకౌంట్లో జమ చేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కలిప్తామని.. ఇలా తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. రైతాంగం పంటల వ్యవసాయ పనుల్లో ఉన్నారు. అయినా వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకానికీ ఇంత వరకూ అతీ గతీ లేదు. గత ఐదేళ్లలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

ప్రతి మహిళకు నెలకు రూ.1500



ఏడాదికి

నియోజకవర్గం	అర్హులు	మొత్తం(రూ.కోట్లు)
నర్సీపట్నం	1,05,963	190.73
చోడవరం	74,350	133.83
మాడుగుల	70,000	126

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గాల వారీగా అర్హులు	
నర్సీపట్నం	1,62,021
చోడవరం	1,37,425
మాడుగుల	95,993


జగన్ పాలనలో ఐదేళ్లకు రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి(కోట్లలో)
రైతు భరోసా	నర్సీపట్నం	167.5
	చోడవరం	279.32
	మాడుగుల	190


జగన్ పాలనలో ఐదేళ్లకు తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి(కోట్లలో)
అమ్మ ఒడి	నర్సీపట్నం	రూ.148
	చోడవరం	రూ.115.51
	మాడుగుల	రూ.111.12

ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం



ప్రతి తల్లికి రూ.15 వేలు తల్లికి వందనం



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతుకు అందాల్సిన సాయం

నియోజకవర్గం	అర్హులు	(రూ.కోట్లు)
నర్సీపట్నం	42,717	85.43
చోడవరం	51,728	103.45
మాడుగుల	45,200	90.4

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గం	అర్హులు	(రూ.కోట్లు)
నర్సీపట్నం	40,450	60.67
చోడవరం	22150	33.22
మాడుగుల	25,200	37.50

ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు



నియోజకవర్గం	అర్హులు	ఏడాదికి రూ.కోట్లలో
నర్సీపట్నం	62,000	15.75
చోడవరం	72003	17.53
మాడుగుల	75,872	21.60

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



నియోజకవర్గం	అర్హులు	ఏడాకి రూ.కోట్లలో
నర్సీపట్నం	45,000	162
చోడవరం	64,240	231
మాడుగుల	25,300	91.08

గ్యాస్ సిలిండర్ల మాటే లేదు



ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీంతో ఆశతో మహిళలంతా ఓట్లు వేశాం. తీరా చంద్రబాబు పాలన చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా... ఉచిత సిలిండర్లపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పకపోవడంతో హామీని అమలు చేస్తారో లేదో తెలియని గందరగోళం నెలకొంది.

– బండారు ఈశ్వరమ్మ, కింతాడ గ్రామం, కె.కోటపాడు మండలం

నిరుద్యోగ భృతికి ఇంకెన్నాళ్లు..



ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఊరూరా ఊదరగొట్టింది. ఇప్పుడు అధికారంలోకి 100 రోజులైంది. ఇంతవరకు ఉద్యోగం చూపించకపోగా, నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. కనీసం జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు. దీంతో ఉపాధి దొరక్క ఇబ్బంది పడుతున్నాం.

– వొబ్బులరెడ్డి నరేష్, నిరుద్యోగి, తూటిపాల, మాకవరపాలెం మండలం

జగన్ ఉంటే ఈ పాటికి పెట్టుబడి సాయం



సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉంటే జూన్‌లోనే పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నగదును మా ఖాతాల్లో జమ చేసేవారు. గత ఐదేళ్లలో జగన్‌బాబు రూ.13,500 చొప్పున ఏటా అందించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా ఒక్క రూపాయి సాయం ఇవ్వలేదు.

– అనపర్తి నారాయణమూర్తి, రైతు, గొలుగొండ గ్రామం, మండలం

మహిళల ఉచిత ప్రయాణం ఎప్పుడు?



చంద్రబాబు ఎన్నికల సమయంలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చారు. దీంతో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాదిరిగా ఉచిత బస్సు ప్రయాణంపై ఆశ పడ్డాం. ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వాలు కార్యాచరణ ప్రకటించక ముందే మహిళలు ఉచిత ప్రయాణం చేశారు. ఏపీలో మాత్రం అధికారంలోకి వచ్చి రెండు నెలలవుతున్నా హామీ అమలు కాలేదు. ఎప్పుడు అమలు చేస్తారో మహిళలంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

– కదారి దేముడమ్మ, ఆనందపురం గ్రామం, కె.కోటపాడు మండలం

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

మాడుగుల రూరల్ : వీరనారాయణం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం, పి.వి.ఆనంద్ ఈ నెల 5న జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. ఈ సందర్భంగా కింతలి స్కూలు కాంప్లెక్ సమావేశంలో బుధవారం ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు. కింతలి స్కూలు కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింగరావు ఆధ్వర్యంలో ఎంఈవో బి.దేముడమ్మ, ఉపాధ్యాయులు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కె.బంగారయ్యతో పాటు నాగేశ్వరావు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయు సభ్యులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గునుపూడి హైస్కూల్‌కు ఎన్ఆర్ఐ వితరణ



సైన్సుల్యాబ్ సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు

నాతవరం : మండలంలో గునుపూడి హైస్కూల్‌కు ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి సైన్స్ ల్యాబ్ కోసం దాదాపు రూ.40 వేల విలువైన సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ సామగ్రిని బుధవారం హెచ్ఎం టి.శివజ్యోతికి అందజేశారు. వాటిని హైస్కూల్లో ప్రత్యేకంగా కేటాయించిన గదిలో అమర్చి ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబుతో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుకు దాతలు సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చమ్మచింత, ఎంబీ పట్నం హైస్కూల్ హెచ్ఎంలు కె.శివప్రసాద్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు



కె.జె.పురంలో డ్రాలో గెలుపొందిన లడ్డూను ఆడారి బాబ్జికి అందజేస్తున్న యూత్ సభ్యులు

మాడుగుల రూరల్ : గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో గణేశ్ విగ్రహాలు మంగళవారం రాత్రి సమీప నదుల్లో నిమజ్జనం చేశారు. కె.జె.పురం ఈగల్స్ టాలెంట్ యూత్ (2018 పూర్వ విద్యార్థులు) ఆధ్వర్యంలో ఆరు కిలోల స్వామి వారి లడ్డూకు డ్రా తీశారు. ఈ డ్రాలో ఆడారి బాబ్జి లడ్డూను దక్కించుకున్నారు. యూత్ సభ్యులు లడ్డూను బాబ్జికి అందజేసారు. అలాగే అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో గణేశ్ విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.

బుచ్చెయ్యపేట : మండలంలో వడ్డాది, నేతవానిపాలెం, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో వినాయక మండపాల వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్న సమారాధనలు చేయగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాత్రికి భజనలు చేసి పలువురు భక్తి గీతాలాపనలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు, మందుగుండు సామాగ్రి నడుమ వినాయకుల ఊరేగింపు నిర్వహించి నిమజ్జనాలు చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, నాయకులు తమరాన దాసు, దొండా రాజా, నరేష్, శ్రీను, యెనుముల వాసు, బాబూరావు అన్న సమారాధనలో పాల్గొన్నారు.


మాడుగుల: మండలంలో జంపెన గ్రామంలో వాసవీ క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. వాసవీమాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుమారు 2500 మందికి అన్న సమారాధన జరిపారు.

కె.కోటపాడు : పాడుగుపాలెం రామాలయం వద్ద బుధవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో పాటు ఎ.కోడూరు, ఎ.భీమవరం ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం రాత్రికి వినాయకస్వామి అనుపోత్సవం జరిపారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపి నిమజ్జనం చేశారు.

3వేల మందికి అన్నదానం

నాతవరం : మండల కేంద్రంలో వినాయకుడి గుడిలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణకర్త తూతిక బెన్నయ్యలింగం ఆధ్వర్యంలో సుమారు 3 వేల మందికి అన్నదానం జరిపారు. మండలంలో పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్న సమారాధనలు జరిగాయి.


ఎంఈవో-2 మూర్తి బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో-2 మూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గొలుగొండ : గొలుగొండ మండలం విద్యాశాఖ అధికారి-2గా సీనియర్ ఉపాధ్యాయులు ఎ.వి.ఎస్.ఎస్.మూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలో ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గతంలో ఆయన జోగుంపేట, పాకలపాడు తదితర హైస్కూల్లో హెచ్ఎంగా పనిచేశారు.

ఎస్ఐను కలిసిన జెడ్పీటీసీ



ఎస్ఐ శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలుపుతున్న జెడ్పీటీసీ, నాయకులు

బుచ్చెయ్యపేట స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావును మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం బుచ్చెయ్యపేట ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనను జెడ్పీటీసీ దొండా రాంబాబు,వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి,గొంపా చినబాబు,తూర్పు కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి నానాజీ,సర్పంచ్‌లు పడాల నాగభూషణం,గోపిశెట్టి శ్రీను,కోవెల ఈశ్వరరావు, అమ్మునాయుడు కలిసి అభినందించారు.

చెరకుకు రూ.4వేల మద్దతు ధర ఇవ్వాలి

కె.కోటపాడు : చెరకు పంటకు ఈ ఏడాది మద్దతు ధరను టన్నుకు రూ.4వేలు అందించాలని సీపీఎం నాయకుడు వనుము సూర్యనారాయణ అన్నారు. ఈ నెల 29న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభలో ఈ మద్దతు నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. సాగు ఖర్చులు పెరిగిన దృష్ట్యా మద్దతు ధర పెంచాలన్నారు. మూడేళ్లుగా సభ్య రైతులు మరణించిన సమయంలో వారి కుటుంబాలకు ఫ్యాక్టరీ ద్వారా చెల్లించాల్సిన క్లెయిమ్‌లను నేటికీ చెల్లించలేదని ఆరోపించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని అన్ని విధాలుగా ఆదుకుంటామన్న ఎంపీ సీఎం రమేష్ హామీ నిలబెట్టుకోవాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత


దేవరాపల్లి : దేవరాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దేవరాపల్లి, తారువ ఫీడర్ పరిధిలోని 11 కేవీ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నర్సీపట్నం ఈఈ ఆపరేషన్ వీడీవీ రామకృష్ణ, స్థానిక ఏఈ కె.శంకరరావు తెలిపారు. 11కేవీ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున మండల కేంద్రం దేవరాపల్లితో పాటు వెంకటరాజుపురం, తెనుగుపూడి, గరిశింగి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మాకవరపాలెం: మండంలోని ఐదు ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ డీఈ రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో మాకవరపాలెం, జీ.కోడూరు, బూరుగుపాలెం, లచ్చన్నపాలెం, గిడుతూరు, శెట్టిపాలెం ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

కేజేపురంలో లోవోల్టేజి సమస్య

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో లోవోల్టేజ్ సమస్యతో అప్రకటిత విద్యుత్ కోత పీడిస్తోంది. ప్రధానంగా ఐదో వార్డులో ఈ సమస్య అధికంగా ఉంది. ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు పనిచేయక ఇబ్బందులు పడుతున్నారు. లోవోల్టేజ్ సమస్య వల్ల ఇబ్బందులు పడుతున్నారమని స్థానిక హైస్కూలు కమిటీ మాజీ అధ్యక్షుడు ఆడారి నూక గణేశ్ బుధవారం తెలిపారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఈ సమస్య వల్ల ఇళ్లల్లో మోటార్లు పని చేయక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



శంఖుస్థాపనలో పాల్గొన్న సర్పంచ్, తదితరులు

మాకవరపాలెం : డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ అల్లంపల్లి శిరీష శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో వర్షాలకు ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షపు నీటిని మళ్లించేందుకు రూ.10 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో డ్రైనేజీ నిర్మించేందుకు బుధవారం సర్పంచ్ శిరీష శంకుస్థాపన చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి, పంచాయతీ ఈవో బాలదొర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

124 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు

కె.కోటపాడు : అపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ సూచించారు. ఆనందపురం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య పరీక్షలను నిర్వహించారు. 124 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులకు ఎంఎల్‌హెచ్‌పీ మంగ వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో హెచ్‌వీ భాగ్యం, ఆశా కార్యకర్తలు లక్ష్మి, సైదాబీ పాల్గొన్నారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు



మండల విద్యాశాఖ అధికారి పడాల్‌దాస్

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 20, 21 తేదీలలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి. పడాల్‌దాస్ తెలిపారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా తదితర అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు పోటీలలో పాల్గొనాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



రొంగలినాయుడుపాలెంలో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న భీమరాజు

కె.కోటపాడు : గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుతో అందరికి మంచి ఆరోగ్యం కలగనున్నట్టు పంచాయతీ కార్యదర్శి కె.భీమరాజు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య సిబ్బందికి ప్రజలు ప్రతి రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడితల్లమ్మ, కోటేశ్వరరావు, ఎంపీటీసీ రామలక్ష్మి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు జూరెడ్డి రాము, సచివాలయ కార్యదర్శి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : పరిసరాలు పరిశుభ్రతతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, కె.జె.పురం గ్రామ సర్పంచ్ రమణబాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా, రెండోరోజు కె.జె.పురం గ్రామ సచివాలయం సమీపంలో బుధవారం మొక్కలు నాటారు. ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ పాల్గొన్నారు.